



దామలచెరువు హైస్కూల్ వద్ద భువనేశ్వరికి గజమాలతో స్వాగతం పలుకుతున్న చంద్రగిరి నియోజకవర్గ నేతలు, శ్రేణులు

సమస్య చెబితే కళ్లు పోగొడతారా?

- హంసవేణి కుటుంబానికి భువనేశ్వరి పరామర్శ
- బాధితురాలి కుమారుడి బాధ్యత తీసుకుంటామని హామీ



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 22: బంగారుపాళ్యం మండలం టేకుమందలో వైసీపీవారు హంసవేణిపై దాడి చేసి కంటి చూపును పోగొట్టిన ఘటనపై నారా భువనేశ్వరి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'వైసీపీ దాడిలో చూపే పోయింది' శీర్షికన ఈ ఘటనను 'ఆంధ్రజ్యోతి' బుధవారం వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ కథనాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు ఫేస్‌బుక్, ట్విటర్‌లో పోస్టుచేసి ప్రభుత్వాని నిలదీశారు. ఈ నేపథ్యంలో గురువారం నారా భువనేశ్వరి హంసవేణిని పరామర్శించారు. దాడికి దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను చెబితే కళ్లు పోగొడతారా అంటూ భువనేశ్వరి ఆవేదన వ్యక్తంచేశారు.అన్ని విధానా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దివ్యాంగుడైనా ఆమె కుమారుడి బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కంటి చూపు పోయినా టీడీపీ జెండా వదిలేదిలేదని హంసవేణి చెప్పడంతో భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు.

టీడీపీ శ్రేణులపై వైసీపీ చిత్రహింసలు

మరిచిపోలేం





ఐరాల మండలం పాటూరు క్రాస్ వద్ద ఘనస్వాగతం

- రాష్ట్రాభివృద్ధికి ప్రతి కార్యకర్త కష్టపడాలి
- కొత్త ఓటర్లూ, మీ భవితను దృష్టిలో పెట్టుకుని ఓటేయండి
- నారా భువనేశ్వరి పిలుపు
- మూడో రోజు ఐదు కుటుంబాలకు పరామర్శ

కల్లూరు/ ఐరాల/ బంగారుపాళ్యం/ చిత్తూరు సిటీ: 'తెలుగుదేశం పార్టీ వారిని చిత్రహింసలకు గురిచేయడం.. అక్రమ కేసులు పెట్టడం.. వీరి ప్రాంతాలను దెబ్బతీయడం. ఇదే వైసీపీ ప్రభుత్వం పని. వీటిని మరచిపోలేం. టీడీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ గురించి అందరూ గొప్పగా మాట్లాడుకునేవారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వ అరాచకాల గురించి మాట్లాడుకుంటున్నారు. ఇది సిగ్గుచేటు' అని నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన గురువారం ఆమె ఐదు కుటుంబాలను పరామర్శించారు. ఆయా ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. చంద్రబాబు జైలులో ఉన్న సమయంలోనే పుంగనూరు నియోజకవర్గంలో చల్లా బాబుతో పాటు వందలాది మంది అక్రమకేసుల్లో జైలులో ఉంటూ ఇబ్బందులు పడ్డారనే విషయం మరిచిపోలేమన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. ప్రస్తుతం మహిళలు కూడా ధైర్యంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు.రాష్ట్ర భవిత కోసం పార్టీ కార్యకర్త, నాయకుడు చేయిచేయి కలిపి పార్టీని ముందుకు తీసుకెళ్లి చంద్రబాబును గెలిపించాలని కోరారు. సీఎంగా చంద్రబాబునాయుడు ఉంటే.. రాష్ట్రం ఎలా ముందుకు వెళ్లాలి? ఏవిధంగా అభివృద్ధి కావాలి, భావితరాల భవిష్యత్తుకోసం పరిశ్రమలు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తారని వివరించారు. రాష్ట్రాభివృద్ధికి ఓటు అనే ఆయుధం వినియోగించుకోవాలని సూచించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువత.. రాష్ట్ర, మీ భవిష్యత్తును గుర్తుంచుకుని ఓటేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ వారి దౌర్జన్యాలు, అక్రమాలకు దీటుగా జవాబు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో పార్టీ శ్రేణులు ఎన్నోత్యాగాలు చేసి, అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేసుకున్నారు. జగన్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని, యువతకు ఉద్యోగులు, ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఈ అరాచక ప్రభుత్వంపై రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో కార్యకర్తలు సైఅంటే సై అనేలా పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు.



ఐరాల మండలం చింతగుంపలపల్లెలో ప్రకాష్ ఇంటి మిద్దెపైనుంచి గ్రామస్తులతో మాట్లాడుతున్న భువనేశ్వరి



వృద్ధురాలి ఆశీర్వాదం అందుకుంటూ..

కమ్మపల్లెపై కక్ష కట్టిన మంత్రి పెద్దిరెడ్డి

పులిచెర్ల మండలం కమ్మపల్లెవాసులు టీడీపీకి మద్దతు ఇస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గ్రామంపై కక్ష కట్టారని భువనేశ్వరికి విన్నవించారు. జనాభా ఉన్నా కమ్మపల్లెలోని పాఠశాలను రద్దుచేయించి బయట అడవిలో కట్టారన్నారు. కమ్మపల్లెకి మంజూరైన వాటర్‌ట్యాంకు ఊరి బయట కట్టారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి ఎంత ప్రయత్నించినా తాము వైసీపీలోకి వెళ్లకపోవడంతో అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు మద్దతుదారులుగా ఉంటామని, టీడీపీ అంటే తమకు ప్రాణమన్నారు. పగడాలవారిపల్లెలో టీడీపీ జాతీయ కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ పునర్విభజనకు ముందు పులిచెర్ల మండలం చంద్రగిరి నియోజకవర్గంలో ఉండేదని, నారావారిపల్లె ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నారు. ప్రజలు ప్రతి ఎన్నికలో టీడీపీకి మెజార్టీ ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి టీడీపీ వారిని హింసిస్తుండగా మధుసూదన్‌రెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కొన్ని విషయాల్లో సహాయం చేశారని గ్రామస్తులు తెలిపారు.

పక్షవాతం.. అడ్డురాని అభిమానం



వృద్ధాప్యం.. ఆపై పైగా పక్షవాతం. అయినా రామచంద్రనాయుడు ట్రాలీ కుర్చీలో బయటకు రోడ్డుపైకి వచ్చారు. ఐరాల మండలం చింతగుంపలపల్లెకు వస్తున్న నారా భువనేశ్వరి కోసం ట్రాలీలో కూర్చొని ఎదురుచూస్తున్నారు. ఈ విషయం తెలిసి ఆమె.. ఆయన వద్దకు వెళ్లారు. ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఏదైనా అవసరమైతే నాయకులు అందుబాటులో ఉంటారన్నారు. మరో వృద్ధురాలితో ఆమె ముచ్చటించారు.

- ఐరాల

నేటి పర్యటన ఇలా..

శుక్రవారం ఉదయం 10.45 గంటలకు చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరలో.. 11.45 గంటలకు ఎస్‌ఆర్‌పురం మండలం గంగమ్మ గుడి గ్రామంలో కర్లం ఆంజనేయులు నాయుడు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శిస్తారు. 1.15 గంటలకు తిరుపతి జిల్లా నారాయణవనం మండలం తుంబూరులో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి.. 3.25 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు పయనమవుతారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

అడుగడుగునా జనహారతి

జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటనకు జనం హారతి పడుతున్నారు. గురువారం ఆమె పులిచెర్ల, ఐరాల, బంగారుపాళ్యం మండలాలు, చిత్తూరు నగరంలో పర్యటించారు. ప్రతిచోట ఘన స్వాగతం లభించింది. బాధిత కుటుంబాలను పరామర్శించి, సభ్యులకు ధైర్యం చెప్పడం.. తనను చూసేందుకు వచ్చిన వారితో మాట్లాడే క్రమంలో ఆమె పర్యటన రెండు గంటల పాటు ఆలస్యంగా సాగింది. అన్నిచోట్లా కార్యకర్తలు, మహిళలు, స్థానికులు ఆమె కోసం పెద్దఎత్తున వేచి చూశారు. పులిచెర్ల నుంచి ఐరాల మండలానికి వస్తున్న భువనేశ్వరికి దామలచెరువులో చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని, కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి ఎన్టీఆర్ విగ్రహానికి భువనేశ్వరి నివాళులర్పించారు. ఐరాల మండలం పాటూరు వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి మురళీమోహన్ ఆధ్వర్యంలో శ్రేణులు గజమాలతో స్వాగతం పలికారు. చిత్తూరు మురకంబట్టు సర్కిల్‌లో గురువారం రాత్రి రెండు గంటలు ఆలస్యమైనా అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున వేచి చూశారు. టపాసులు పేల్చి నాయకులు స్వాగతం పలికారు. దొరబాబు, గురజాల జగన్మోహన్, చంద్రప్రకాష్, హేమలత, కాజూరు బాలాజీ, తేజస్విని పాల్గొన్నారు.

పర్యటన సాగిందిలా..

- పుంగనూరు నుంచి బయలుదేరిన ఆమె.. పులిచెర్ల మండలం కమ్మపల్లెలో వెంకటపతి నాయుడు, పడగలవారిపల్లెలో దొరస్వామి కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి వెంట ఉన్నారు.
- ఐరాల మండలం చింతగుంపలపల్లెలో జయప్రకాష్, బంగారుపాళ్యం మండలం టేకుమందలో గోవిందయ్య కుటుంబాలను ఓదార్చారు. వైసీపీ దాడిలో రెండు కళ్లను కోల్పోయిన హంసవేణిని పరామర్శించారు. ఆమె వెంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మురళీమోహన్ ఉన్నారు. చిత్తూరు నగరం కోకలూరులో గురువారం రాత్రి చెరుకూరు సుజాతమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. బ్యాన్స్ హోటల్‌లో బస చేశారు. ఆయా కుటుంబాలను పరామర్శించిన అన్నిచోట్లా ఆమెను చూసేందుకు, సంఘీభావం పలికేందుకు వచ్చిన కార్యకర్తలను, మహిళలను చూసి భువనేశ్వరి మాట్లాడారు. మార్గమధ్యంలో వేచిఉండేవారిని చూసి కారు ఆపి పలకరిస్తూ వెళ్లారు.

సీఎం పర్యటన ఏర్పాట్లకు

రూ.2 కోట్లు కావాలి

- హౌసింగ్ ఎండీకి లేఖ రాసిన కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల కోసం రూ.2 కోట్ల నిధుల్ని మళ్లించమని హౌసింగ్ శాఖ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్‌కు కలెక్టర్ షన్మోహన్ లేఖ రాశారు. వివరాల్లోకి వెళితే.. రామకుప్పంలో హంద్రీనీవా నీళ్లను వదిలి, బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు సీఎం జగన్ పర్యటన ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. ఫైనల్‌గా ఆయన సోమవారం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యటన ఏర్పాట్లను పూర్తి చేసేందుకు రూ.2 కోట్ల వరకు ఖర్చు కానుంది. సాధారణంగా కలెక్టర్ ఖాతాల్లో కనీసం రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు నిధులు ఉంటాయి. టీడీపీ హయాంలో పనిచేసిన సిద్ధార్థజైన్, ప్రద్యుమ్న ఖాతాల్లో రూ.కోట్లలో నిధులు నిత్యం ఉండేవి. వాటితో కలెక్టర్లు తమ విచక్షణతో పలు కార్యక్రమాలు చేపట్టేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో పనిచేసిన ఏ కలెక్టర్ ఖాతాలోనూ రూ.10 లక్షలకు మించి ఉండడం లేదు. ఇదిలా ఉండగా, జిల్లాల్లో సీఎం జగన్ పర్యటన ఉన్నప్పుడు ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధుల్ని మంజూరు చేస్తుంది. ఈసారి ప్రత్యేక నిధులు జిల్లాకు రాలేదని తెలిసింది. ఈ క్రమంలో ఏర్పాట్ల కోసం రూ.2 కోట్లను అత్యవసరంగా కేటాయించాలని కలెక్టర్ హౌసింగ్ ఎండీకి గురువారం లేఖ రాశారు. ప్రస్తుతం ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బిల్లుల నిధులు హౌసింగ్ శాఖ అందుబాటులో ఉన్నాయి.

ఎఫ్‌ఏ-4 పరీక్షలకు వాట్సప్ ప్రశ్నపత్రాలే


చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 22: జిల్లాలో శుక్రవారం నుంచి మొదలయ్యే ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)-4 పరీక్షలను వాట్సప్ ప్రశ్నపత్రాలతో నిర్వహించనున్నారు. వాట్సప్‌కు వచ్చే ప్రశ్నలను.. ఇన్విజిలేటర్లు బోర్డులపై రాస్తారు. వీటికి విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి వరకు జరిగే ఈ పరీక్షలు జరగనున్నాయి. విద్యా సంవత్సరంలో రెండు సమ్మెటివ్, నాలుగు ఫార్మెటివ్ అసిస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం నుంచి ప్రశ్నపత్రాలు సరఫరా చేయాలి. ఇందుకు గాను ప్రైవేటు పాఠశాలల నుంచి అధికారికంగా కొంత రుసుం వసూలు చేశారు. కేవలం సమ్మెటివ్ పరీక్షలకు మాత్రం ప్రశ్నపత్రాలు ఇస్తున్నారు. ఫార్మెటివ్ పరీక్షలకు మాత్రం నిర్దేశిత సమయానికి కొంత ముందుగా ప్రశ్నపత్రాన్ని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అధికారులు ఫార్వర్డ్ చేస్తారు. ఆయా పాఠశాలల ఆర్థిక స్థితిగతుల ఆధారంగా కొన్నిచోట్ల జిరాక్స్ చేసి ప్రశ్నపత్రాలు ఇవ్వగా, మరి కొన్ని చోట్ల టీచర్లు బోర్డుపై ప్రశ్నలను రాస్తారు. వీటివల్ల పేపర్ లీక్ అవుతుందని, చదివే విద్యార్థులకు అన్యాయం జరిగే వీలుందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై డీఈవో దేవరాజును వివరణ కోరగా, టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలకు ప్రశ్నపత్రాలు ఇస్తున్నామని తెలిపారు. ఎఫ్‌ఏ పరీక్షలకు హెచ్‌ఎం వాటప్స్ గ్రూపులకు ప్రశ్నపత్రాన్ని పంపుతామని తెలిపారు.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా


నగరి, ఫిబ్రవరి 22: నగరి నియోజకవర్గంలోని ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉంది. పలువురికి డబుల్ ఎంట్రీలున్నా అలాగే వదిలేశారు. నగరి మండలం మిట్టపాళేనికి చెందిన కార్తీక్‌కు రెండు ఓట్లున్నాయి. అదే గ్రామానికి చెందిన శరవణకు బూత్‌నెంబరు 160లో సీరియల్ నెంబరు 698, 699లో ఓట్లున్నాయి. నాగరాజకుప్పం గ్రామానికి చెందిన జ్యోతి అనే మహిళకు బూత్‌నెంబరు 165లో ఓటుండగా.. ఆమెకే పుత్తూరు పట్టణంలోని బూత్‌నెంబరు 71లోనూ ఓటు ఉంది. నగరి మండలం మిట్టపాళెంలో ఏఎస్ నందకుమార్‌కు బూత్‌నెంబరు 160లో రెండు ఓట్లున్నాయి. ధనుష్‌కు నగరి మండలంలోని బుగ్గఅగ్రహారంలో ఒక ఓటు, నిండ్ర మండలం ఇరుగువాయిలోని 191వ బూత్‌లో మరో ఓటు ఉంది. నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడలో 102వ బూత్‌లో, నగరి మండలం రామాపురంలోని బూత్‌నెంబరు 97లోనూ అమ్ములుకు ఓట్లున్నాయి. ఇలా లెక్కకు మించి డబుల్ ఎంట్రీలున్నా అధికారులు తొలగించకపోవడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఇలాంటి తప్పులను సరి చేయాలని కోరుతున్నారు.



నగరి మండల పరిధిలో 160వ బూత్ మిట్టపాలెంలో డబుల్ ఎంట్రీ ఉన్న దృశ్యం



ధనుష్ అనే వ్యక్తికి నగరి, నింద్ర మండలాల్లో ఓటు



నగరి మండలం, పుత్తూరు పట్టణంలోనూ ఓట్లున్న జ్యోతి

వివాహిత మృతి కేసులో ఇద్దరి అరెస్ట్

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 22: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. నల్లగుట్లపల్లె తాండా సర్పంచ్ శ్రీనివాసులునాయక్ భార్య మాధవి క్వారీలో అనుమానాస్పద స్థితిలో పడి మృతిచెందిన ఘటన తెలిసిందే. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు.. శ్రీనివాసులు నాయక్, పద్మపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు.



ఐఐటీ స్నాతకోత్సవంలో డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణతో కలిసి విద్యార్థులకు పట్టాలందజేస్తున్న ఐఐటీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ సజ్జన్ జిందాల్

అద్వితీయ విద్యాసంస్థ
తిరుపతి ఐఐటీ

● స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్





ఐఐటీ స్నాతకోత్సవంలో వర్చువల్ పద్ధతిలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ప్రసంగం

ఏర్పేడు, ఫిబ్రవరి 22 : ఓవైపు శ్రీవెంకటేశ్వర స్వామి, మరోవైపు శ్రీకాళహస్తీశ్వర స్వామి వార్ల ఆశీస్సులు పొందుతున్న తిరుపతి ఐఐటీ దేశంలోని మిగిలిన ఉన్నత విద్యా సంస్థలతో పోలిస్తే అద్వితీయ విద్యా సంస్థ అని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కొనియాడారు. తిరుపతి జిల్లాలోని ఏర్పేడు సమీపంలో వున్న తిరుపతి ఐఐటీ 4వ మరియు 5వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఢిల్లీ నుంచీ వర్చువల్ విధానంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువ విద్యార్థులకు నాణ్యమైన, అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో మోదీ ప్రభుత్వ నిబద్ధతకు ఐఐటీలే నిదర్శనమన్నారు. ఆరోగ్యకరంగా ఎదిగే ప్రక్రియలో తిరుపతి ఐఐటీ నిస్సందేహంగా ఒక ప్రధాన లబ్ధిదారని మంత్రి అభివర్ణించారు. స్వల్ప వ్యవధిలోనే తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ సాధించిందని, అలాగే ఐఐటీ నవవిష్కార్, ఐ హబ్ ఫౌండేషన్ వంటివి ఏర్పాటు చేయడంలో చొరవ చూపిందని ప్రశంసించారు. తిరుపతి ఐఐటీ సెంటర్ ఆఫ్ ఎగ్జలెన్స్ ప్రధానంగా స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, ఈవీ టెక్నాలజీస్ వంటి అంశాలపై దృష్టి సారించిందని, దేశంలోని పట్టణ రవాణా రంగంలో పెరుగుతున్న అవసరాలను తీర్చడంలో తిరుపతి ఐఐటీకి చెందిన ఈ విభాగాలు గేమ్ ఛేంజర్ కాబోతున్నాయన్నారు. స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ టెక్నాలజీస్, ప్రిసెషన్ అగ్రికల్చర్ రంగాల్లో తిరుపతి ఐఐటీ దృష్టి సారించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. తిరుపతి ఐఐటీ బాలికలు ఎంచుకుంటున్న ప్రధాన గమ్యస్థానంగా మారడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని ఇతర ఐఐటీల కంటే ఇక్కడే ఎక్కువ సంఖ్యలో బాలికలు చదువుకుంటున్నారని, ఇది నారీ శక్తికి నిదర్శనమన్నారు. నారీ శక్తి వందన్ అధినియమ్ అనేది తమ ప్రభుత్వ నిర్ణయమని, లోక్‌సభలోనూ, రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మూడొంతుల సీట్లు మహిళలకు రిజర్వు చేయడం అందులో భాగమేనన్నారు. నిర్ణయాత్మక శక్తిగా మహిళలను అభివృద్ధి పరచడమే దాని ఉద్దేశమన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంచే దిశగా ఐఐటీల నుంచీ వెలుపలికి వచ్చిన విద్యార్థినులు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా పట్టభద్రులవుతున్న రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి విద్యార్థుల ఈ ప్రయాణంలో కీలక పాత్ర పోషించిన తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఐఐటీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్, మరియు జిందాల్ స్టీల్ వర్క్స్ సంస్థ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అతిథిగా రావడం సంతోషంగా ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు ప్రపంచస్థాయికి ఎదగాలని కోరారు. ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటీ పనుల ప్రారంభంలో ఈ ప్రాంతంలో తిరగడానికి భయపడేవారమని గుర్తు చేసుకున్నారు.విద్యార్థులకు సరిపడే కళాశాల భవనాలు, హాస్టల్ భవనాలు, లేబరేటరీలు, క్యాంటీన్లు, మీటింగ్ హాళ్లు, తరగతిగదులతో ప్రస్తుతం ఆహ్లాదకరమైన వాతావరణం కళాశాలలో ఉందన్నారు.పీఆర్వో చమన్ మెహతా, ఎస్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆనందంగా ఉంది

బీటెక్ పోగ్రాంలో బెస్ట్ అకడమిక్ పెర్ఫార్మెన్స్ అవార్డు అయిన ప్రెసిడెంట్ మెడల్‌ను అమ్మానాన్నల సమక్షంలో అందుకోవడం ఆనందంగా ఉంది.ఐఐటీలో చేరిన మొదట్లో ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పుతో చాలా ఇబ్బంది పడ్డా.మెల్లిగా తిరుపతి వాతావరణానికి అలవాటు పడి చదువుకున్నా.

- సౌమిత్రో వ్యాపారి, ప్రెసిడెంట్ మెడల్ విన్నర్



నా కష్టానికి ఫలితం

పట్టుదల,కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చనే మాటను నిజం చేయడానికి చాలా కష్టపడ్డా.పట్టుదలతో చదువుకుని గవర్నర్ ప్రైజ్‌కు ఎంపికయ్యా. స్నాతకోత్సవంలో గవర్నర్ ప్రైజ్‌ను ఇంతమంది ప్రముఖుల సమక్షంలో అందుకోవడం సంతృప్తినిచ్చింది.

- ప్రభాత్ రెడ్డి లంకిరెడ్డి, గవర్నర్ ప్రైజ్ విన్నర్

575 మందికి పట్టాల ప్రదానం

స్నాతకోత్సవాలను పురస్కరించుకుని క్యాంపస్‌లో మొత్తం 575మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణతో కలిసి సజ్జన్ జిందాల్ ఈ పట్టాలను అందజేశారు. బీటెక్ పూర్తి చేసిన 355 విద్యార్థులకు, ఎంటెక్ పూర్తి చేసిన 106 మంది విద్యార్థులకు, ఎమ్మెస్సీ ముగించిన 74 మందికి, ఎంఎస్ పూర్తి చేసిన 17 మందికి, పీహెచ్‌డీ పూర్తి చేసిన 21 మందికి, డ్యూయల్ డిగ్రీ చేసిన ఇద్దరికి చొప్పున మొత్తం 575 మందికి పట్టాలు అందజేశారు. 2021-22 బ్యాచ్ 4వ స్నాతకోత్సవానికి సంబంధించిన మొత్తం బీటెక్ గ్రాడ్యుయేట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సౌమిత్రో వ్యాపారికి ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, లంకిరెడ్డి ప్రభాత్‌రెడ్డికి గవర్నర్ ప్రైజ్ లభించాయి. అలాగే 2022-23 బ్యాచ్ 5వ స్నాతకోత్సవానికి సంబంధించి బీటెక్ గ్రాడ్యుయేట్లలో అత్యుత్తమ ప్రతిభ చాటిన దేబాషీ దాస్ అనే విద్యార్థిని ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, నోబుల్ సాజి మాథ్యూస్‌కు గవర్నర్ ప్రైజ్ లభించాయి.



'నిజం గెలవాలి'లో భాగంగా గురువారం పులిచెర్ల మండలం పగడాలవారిపల్లెలో మునస్వామి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి - పులిచెర్ల మండలం కమ్మపల్లిలో వెంకటపతి నాయుడు చిత్రపటానికి నివాళులు - ఐరాల మండలం చింతగుంపలపల్లి గ్రామంలో ప్రకాష్ కుటుంబానికి చెక్ అందజేత



బంగారుపాళ్యం మండలం టేకుమంద గ్రామంలో వి.గోవిందయ్య గౌడ్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి - చిత్తూరులో సుజాతమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ

జడ్పీ సీఈవోగా గ్లోరియా బాధ్యతల స్వీకరణ



జడ్పీ సీఈవో గ్లోరియాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభాకర్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 22: ఉమ్మడి చిత్తూరు జిల్లాపరిషత్ ముఖ్యప్రణాళికాధికారిణిగా (సీఈవో) గ్లోరియా గురువారం సాయంత్రం ప్రస్తుత ఇన్‌చార్జి సీఈవో ప్రభాకర్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆమెను డీపీఆర్సీ కోఆర్డినేటర్ ఐఆర్ షణ్ముగరామ్‌తో పాటు జడ్పీలోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు ఆమె కలెక్టర్ షన్మోహన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

చెన్నై ఎయిర్‌పోర్టులో చిత్తూరు మహిళ అరెస్టు

● 68 సిమ్ కార్డులు స్వాధీనం

అడయార్, ఫిబ్రవరి 22: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో చిత్తూరు జిల్లాకు చెందిన రోజా(40)ను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి 68 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకుని, విచారణ జరుపుతున్నారు. గురువారం చెన్నై నుంచి దుబాయ్‌వెళ్లే విమానం ఎక్కుతున్న ప్రయాణికుల లగేజీలను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేస్తుండగా ఇవి బయటపడ్డాయి. సిమ్‌కార్డుల గురించి ప్రశ్నించగా, ఎయిర్‌పోర్టులో ఒక అపరిచిత వ్యక్తి దుబాయిలో ఒక మహిళకు అందజేయమంటూ బ్యాగు ఇచ్చారని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఆమెను అరెస్టు చేశారు.

దాడి చేస్తే తూతూమంత్రంగా కేసులా..?

● జాటీతో కొట్టుకుంటూ టీడీపీ నేత వినూత్న నిరసన



జాటీతో కొట్టుకుంటున్న నిరసన తెలుపుతున్న టీడీపీ నేత

గుడిపాల, ఫిబ్రవరి 22: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి చేసి ఐదు రోజులు గడుస్తున్నా తూతూ మంత్రంగా కేసులు పెట్టి ఒకరిని అరెస్టు చేసి, మిగిలినవారిని ఇంకా అరెస్టు చేయక పోవడం దౌర్భాగ్యమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. దీనికి నిరసనగా గురువారం గుడిపాల మండలం సియోన్‌మలై చర్చివద్ద తనను తానే జాటీతో కొట్టుకుంటూ చంద్రమోహన్ నిరసన తెలిపారు.

మీడియాపై దాడులు హేయం: చింతా

కుప్పం:రాష్ట్రంలో మీడియాపై జరుగుతున్న దాడులు హేయమని కాంగ్రెస్ నేత, తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ పేర్కొన్నారు. కుప్పంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను, లోపాలను ఫొటోలు సహా ఎత్తిచూపడం పత్రికాస్వేచ్ఛలో భాగమన్నారు. ఈ వాస్తవాలను జగన్‌రెడ్డి భరించలేకున్నారన్నారు. అందులో భాగంగానే ఈ దాడులు చేస్తున్నారన్నారు. వీటిని చూస్తుంటే బీహారులో ఉన్నామా అని అనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

చిత్తూరు జిల్లా : ఫిబ్రవరి 22: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయ స్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. చిత్తూరు జిల్లా, తిరుపతిలో, రామానుజా సర్కిల్, తిరుచానూర్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ పైన, హోటల్ మీనాక్షి నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి నైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శని రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

చిత్తూరు అపోలోలో జర్మనీ యూనివర్సిటీ కార్యాలయం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఇంగ్ బ్రెన్డ్ మార్కర్ట్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 22: చిత్తూరులోని అపోలో మెడికల్ కళాశాలలో జర్మనీలోని ఆర్‌డబ్ల్యూటీహెచ్ యూనివర్సిటీ కార్యాలయాన్ని గురువారం ఆ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఇంగ్ బ్రెన్డ్ మార్కర్ట్ ప్రారంభించారు. ఈ కార్యాలయం ద్వారా విద్యార్థులకు విదేశీ విద్యకు సంబంధించి పరిజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. ఇంటర్న్‌షిప్, రీసెర్చ్ గురించీ ఇక్కడ తెలుసుకోవచ్చన్నారు. ఈ సంస్థ ద్వారా భారత్‌లో ఉన్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలతో పాటు పరిశోధనలకూ ఎంతో ఉపయోగమని అపోలో వైస్ ఛాన్సలర్ వినోద్ భట్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి, డీన్ సునీల్, డాక్టర్లు సందీప్, రాజ్‌వెంకట్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



రాజుపేట సమీపంలో హంద్రీ-నీవా కాలువ వద్ద కలెక్టరు

రామకుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 22: కుప్పం నియోజకవర్గంలో సీఎం జగన్ సోమవారం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను గురువారం ఎంపీ రెడ్డెప్ప, కలెక్టరు షన్మోహన్ పరిశీలించారు. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువను, హెలిపాడ్ స్థలాన్ని చూశారు. అనంతరం శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో సభాస్థలిని, హెలీప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లను వారు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్, కుప్పం డీఎస్పీ శ్రీనాథ్, రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, సీఎం పర్యటనలో భాగంగా తొలుత రాజుపేట వద్ద హంద్రీ-నీవా జలాలను విడుదల చేయనున్నారు. దీని కోసం కాలువ బ్రిడ్జి వద్ద గేట్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. దీనికోసం గురువారం ఉదయం నీటిని వదలగా, సాయంత్రానికి వర్ధికుప్పం చేరుకున్నాయి. వర్ధికుప్పం నుంచి రెండు చోట్ల అడ్డు కట్టలు వేసి నీటిని నిల్వ చేస్తున్నారు. సీఎం వచ్చేసరికి రాజుపేట వద్ద కాలువ నిండా నీళ్లుండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పాత పెన్షన్ ఇచ్చేవాళ్లకే ఓటు : యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 22: పాత పెన్షన్ ఇచ్చే పార్టీకే ఓటు వేయాలని యూటీఎఫ్ తీర్మానం చేసింది. గురువారం చిత్తూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నేతల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొని దిశానిర్దేశం చేశారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలు కార్పొరేట్ సంస్థలకు లాభాలు ఇచ్చేవని, కేవలం పాత పెన్షన్ విధానమే ఉద్యోగులకు లాభదాయమన్నారు. పాత పెన్షన్ అమలు చేసే వారికే ఓటు వేయాలని తీర్మానం చేశారు. గతంలో పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని తీసుకొచ్చిన కాంగ్రెస్.. మిగిలిన రాజకీయ పార్టీల రాష్ట్రాల్లోనే ప్రజా పోరాటానికి ఓపీఎస్ విధానం తిరిగి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 14 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలలు భవిష్యత్తులో కొనసాగించడం కష్టతరమవుతుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి రమణ మాట్లాడుతూ 14 సంవత్సరాలు పోరాడి అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకున్నామని, ఇప్పుడు 2024 డీఎస్సీలో తిరిగి అప్రెంటిస్ విధానం ప్రవేశపెట్టడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, రెహనాబేగం, రెడ్డెప్ప, దీనావతి, బాషా, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

టికెట్లు కావలెను

● కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తులు



ఆంధ్రరత్న భవన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తులు ఇస్తున్న దృశ్యం

నగరి, ఫిబ్రవరి 22: నగరి పట్టణానికి చెందిన బాబు, రాకేష్‌రెడ్డి, అమ్ములు కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల కోసం గురువారం విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో దరఖాస్తులు అందించారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ తరపున చిత్తూరు పార్లమెంటు అభ్యర్థిగా రాష్ట్ర పీసీసీ కార్యదర్శి బాబు, నగరి అసెంబ్లీ స్థానానికి రాకేష్‌రెడ్డి, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం అమ్ములు స్థానిక నాయకులతో కలిసి ఈ దరఖాస్తులు అందించారు. నగరి దళితవాడకు చెందిన బాబు విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్‌పార్టీ మద్దతుదారుగా, మాజీమంత్రి రెడ్డివారి చెంగారెడ్డి శిష్యుడిగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. నగరి మున్సిపల్ తొలి వైస్‌ఛైర్మన్‌గా ఎంపికైన ఈయన ప్రస్తుతం పీసీసీ కార్యదర్శిగా ఉన్నారు.

జనానికి కూడులేదు.. జగన్‌కి కోట్లు కావాలా?

● మాజీ ఎంపీ చింతా మోహన్



మాట్లాడుతున్న చింతా మోహన్

కుప్పం, ఫిబ్రవరి 22: 'ముఖ్యమంత్రీ ఇక్కడ ప్రజలు కూడు లేక చస్తుంటే నీకు కోట్లు కావాలా?' అని కాంగ్రెస్ నాయకుడు చింతామోహన్ ప్రశ్నించారు. కుప్పంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రం అవినీతిలో కూరుకుపోయి ఉందని ఆరోపించారు. ఏపీలో ఎమ్మెల్యేలు, మంత్రులు నిద్రలేచింది మొదలు తిరిగి నిద్రపోయేదాకా డబ్బు సంపాదనలోనే గడుపుతున్నారని, అధికార యంత్రాంగం సైతం కాసులు లేనిదే పనులు చేయడంలేదని అన్నారు. ఇక ముఖ్యమంత్రి అయితే ఇసుక, మద్యం ఇంకా ఇతర మార్గాల ద్వారా దోచుకుని దాచుకుంటున్నారని తీవ్రమైన విమర్శ చేశారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, జిల్లా కార్యదర్శి కలికిరి చిరంజీవి, పూతలపట్టు ప్రభాకర్, పళని, ఇర్ఫాన్, గోవిం, నిజాం, సంతోశ్ పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన ఆశాజ్యోతి



కుప్పం, ఫిబ్రవరి 22 : చిత్తూరు పార్లమెంట్ టికెట్‌ను ఆశిస్తున్న డాక్టర్ ఇ.ఆశాజ్యోతి బుధవారం జిల్లా పర్యటనలో ఉన్న టీడీపీ నాయకురాలు నారా భువనేశ్వరిని కలిశారు. ఆమెకు తన ప్రొఫైల్‌ను అందజేశారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో చాలా కాలం ప్రొఫెసర్‌గా పనిచేసిన తనకు చిత్తూరు పార్లమెంటు స్థానంనుంచి పోటీ చేసే అవకాశం కల్పించాల్సిందిగా ఈ సందర్భంగా ఆమె, భువనేశ్వరిని కోరారు. పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఇ.ఆంజనేయులు కుమార్తె అయిన తనకు రాజకీయాలతో పరిచయం ఉందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు కూడా ఆశాలతతో ఉన్నారు.

పోలియో చుక్కలు వందశాతం వేయాలి

పలమనేరు, ఫిబ్రవరి22 : పలమనేరు మున్సిపాలిటీలో వందశాతం పిల్లలకు మార్చి 3వ తేది జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు వేయాలని గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన టాస్క్‌ఫోర్సు సమావేశంలో తీర్మానించారు. మున్సిపాలిటీ పరిధిలో 5034 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సివుందని, ఇందుకోసం 25 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ ఈ పోలియో చుక్కలు వేయాల్సివుంటుందన్నారు. ఆర్టీసీ బస్టాండులో కూడా పోలియో చుక్కలు వేసేందుకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, వైద్యాధికారులు మాధవి, నిరంజన్‌కుమార్, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, సూపర్‌వైజర్లు ఉషాకుమారి, వాణి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న పూజారులు



కుప్పం, ఫిబ్రవరి 22: పట్టణంలోని ఓ ప్రాంతంలో మున్సిపల్ అధికారులు నివాసాలకు వేయాలనుకున్న రోడ్డును ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయ పూజారులు అడ్డుకున్నారు. చెరువుకట్ట మీద ఉన్న రహదారినుంచి మసీదు పక్కగా లోపలికి ఉన్న నివాసాల వరకు రోడ్డు నిర్మాణానికి గురువారం మున్సిపల్ అధికారులు ప్రయత్నించారు. పొక్లయినర్‌తో చదును చేయసాగారు. అయితే పూజారులు విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. రోడ్డు నిర్మాణానికి ఎంచుకున్న స్థలం ఆలయానికి సంబంధించినదని, ఇక్కడ రోడ్డు వేయరాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. గంగమ్మకు వంశపారంపర్య పూజారులు అయిన తాము దీనికి అంగీకరించేది లేదని తెగేసి చెప్పారు. దీంతో అధికారులు రోడ్డు నిర్మాణ ప్రయత్నాలను తాత్కాలికంగా ఆపి వెనుదిరిగారు.

పాల ఏకిరి సాధికార మండల కమిటీ ఏర్పాటు



చౌడేపల్లె, ఫిబ్రవరి 22: టీడీపీ పాలఏకిరి సాధికార మండల కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. గురువారం బోయకొండ సుబ్రహ్మణ్యం ఇంటిలో జరిగిన పాల ఏకిరి బీసీ సాధికార సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కమిటీ మండల అధ్యక్షుడిగా బాలాజినాయుడు, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా గణపతిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వినర్ లక్ష్మీదేవమ్మ, నియోజకవర్గం కమిటీ సభ్యుడు బోయకొండ సుబ్బు, నాయకులు సోమశేఖర్, మణికంఠ, హరి, ప్రసాద్, రాధ, శివ, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేద్దాం

సోమల, ఫిబ్రవరి22: ఈనెల 27న తిరుపతిలో జరిగే ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మందా రామనాథం, జిల్లా యువజన సంఘ మాజీ అధ్యక్షుడు మురళి పిలుపునిచ్చారు. గురువారం వారపు సంతలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసభకు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని, అధిక సంఖ్యలో మండలం నుంచి తరలి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు ప్రభు కుమార్, రవి, మొగిలీశ్వర, వెంకట రామయ్య, లక్ష్మీపతి, ప్రకాశ్, మణి పాల్గొన్నారు.

దేశ ప్రయోజనాల కోసమే వికసిత్ భారత్



మాట్లాడుతున్న అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి

గంగవరం, ఫిబ్రవరి 22 : దేశ ప్రయోజనాల కోసమే వికసిత్ భారత్-2047 సదస్సును నిర్వహించినట్లు మదర్‌థెరీసా కళాశాల కరస్పాండెంట్ రవీంద్ర బాబు తెలిపారు. గురువారం ఆ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ సదస్సునుద్దేశించి అకడమిక్ డైరక్టర్ రాజేంద్రరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అతికొద్ది కళాశాలల్లో మదర్ థెరీసా కళాశాల ఉండడం గర్వకారణమన్నారు. ముఖ్య అతిథిగా చెన్నైకు చెందిన రక్షణ పరిశోధన, అభి వృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్, శాస్త్రవేత్త అయిన వెంకటరమణ విచ్చేసి వికసిత్ భారత్ ద్వారా దేశం సాధిస్తున్న అభివృద్ధి ఎలా ఉంటుందన్న విషయంపై విద్యార్థులకు, అధ్యాపకులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, శరవణన్ పాల్గొన్నారు.

వలంటీర్ల ద్వారా గెలిచిపోతామని వైసీపీ కలలు



మాట్లాడుతున్న గాజులఖాదర్‌బాషా

రామకుప్పం ఫిబ్రవరి 22: రాష్ట్రంలో గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా ప్రజల్ని భయపెట్టి ఎన్నికల్లో గెలిచిపోతామని వైసీపీ నేతలు కలలు కంటున్నారని టీడీపీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా ఆరోపించారు. గురువారం ఆయన రామకుప్పం టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పెద్దలు కుట్రలు, కుతంత్రాలతో ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. అందులో భాగంగానే వలంటీర్లకు తాయిలాలిచ్చి, వైసీపీకి ఓట్లు వేయకపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని భయపెట్టాలని ఆదేశాలిస్తున్నారన్నారు. కుప్పంలో కూడా ఇదే తీరుగా వైసీపీ వ్యవహరిస్తోందన్నారు. వైసీపీ నేతలు ఎంతగా కుట్రలు, కుతంత్రాలు పన్నినా రాష్ట్రంలో టీడీపీ ఘనవిజయాన్ని అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో నేతలు మహ్మద్‌రఫీ, సలాంసాబ్, సర్దార్, నియాజ్, నవాజ్, చాంద్‌బాషా, హపీజ్, సలాం, వేలు, మురళీ పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతి గంగమ్మ ఆలయ కుంభాభిషేకం



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 22 : తీర్థం గ్రామంలో పునర్నిర్మాణం గావించబడిన తిరుపతి గంగమ్మ ఆలయ కుంభాభిషేకం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు గణపతిపూజ, కలశస్థాపన, నవగ్రహపూజ, రుద్రహోమం, ధన్వంతరి హోమం, మహాపూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారికి ప్రత్యేకపూజలు జరిపి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయం వద్ద గ్రామస్థులు అన్నదానం ఏర్పాటు చేశారు.

రేపు మున్సిపల్ సాధారణ సమావేశం

పలమనేరు : పలమనేరు మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 24వ తేది ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

అడుగడుగునా భువనేశ్వరికి బ్రహ్మరథం




పులిచెర్ల మండలం కమ్మపల్లెలో నారా భువనేశ్వరికి గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ అభిమానులు, కమ్మవారిపల్లెకి భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

కల్లూరు/పుంగనూరు, ఫిబ్రవరి 22: మదనపల్లె నుంచి పీలేరు మీదుగా రొంపిచెర్ల క్రాసుకు రాగానే టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలు నారా భువనేశ్వరికి భారీ ఎత్తున ఘనస్వాగతం పలికారు. కమ్మపల్లె, పగడాలవారిపల్లె, కొత్తపేటలో ఆమెకు మహిళలు మంగళ హారతులు పట్టి పూల బొకేలు, పూలమాలలు అందజేస్తూ స్వాగతం పలికగా అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అభివాదం, నమస్కారం చేస్తూ వెళ్లారు. పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలంలో నారా భువనేశ్వరి రాకతో కార్యక్రమాలకు పెద్దఎత్తునా పార్టీ శ్రేణులు తరలివచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, ఎంఎల్‌సీ అనూరాధ, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్ నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.శ్రీనాథరెడ్డి, మాజీ ఇన్‌చార్జి ఎన్.అనీషారెడ్డి, చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు పులివర్తి నాని, జగన్మోహన్‌రాజు, టీడీపీ నాయకులు దినేశ్, రామనాథం నాయుడు, ధనంజయనాయుడు, సుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, మురళీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే కమ్మపల్లెకు చెందిన వెంకటపతినాయుడు గత ఏడాది సెప్టెంబరు 12వతేది చంద్రబాబుకు బెయిల్ రాలేదని పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో మృతుడి తల్లి మంగమ్మకు, గడ్డంవారిపల్లె పంచాయతీ పగడాలవారిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు దొరస్వామి గత ఏడాది సెప్టెంబరు 14వతేది చంద్రబాబు అరెస్టుపై టీవీ చూస్తూ గుండెపోటుతో మృతి చెందగా ఆయన భార్య వరలక్ష్మి, వారి కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించి ధైర్యంచెప్పి ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున సహాయాన్ని అందజేశారు.

రొంపిచెర్లలో నారా భువనేశ్వరికి ఘనస్వాగతం

రొంపిచెర్ల : పులిచెర్లకు వెళుతున్న నారాభువనేశ్వరికి రొంపిచెర్ల క్రాస్‌లో మండలవాసులు గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డితోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆమె వెంట పులిచెర్లకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నాయకులు ఓబులేశ్వరరెడ్డి, కరీముల్లా, రఫీ, అంజాద్‌ఖాన్, గౌస్‌పీర్‌ఖాన్, రవినాయుడు, నాగరాజ, హరిబాబు, అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఉపసర్పంచు

రామకుప్పం : వైసీపీకి చెందిన రామకుప్పం మండలం గొరివిమాకులపల్లె పంచాయతీ ఉపసర్పంచు జగన్నాథం గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ తెలిపారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబులు జగన్నాథంకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నేతలు వెంకటరమణ, ఆదిల్, బాబూసాహెబ్, లక్ష్మీపతి, శంకర్ చలం తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలపై మంత్రి ఆదేశాలతో రౌడీషీట్లు

వైసీపీ తొత్తులుగా ఉన్న అధికారులపై న్యాయపోరాటం



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి22: ప్రజాసేవ చేస్తున్న ముస్లిం మైనార్టీ కార్యకర్తలు, నాయకులపై మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలతో పుంగనూరులో అక్రమ కేసులు, రౌడీషీట్లు తెరవడం దారుణమని టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్ బాషా ఆరోపించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో వరదలు, కరోనా సమయంతోబాటు ప్రజలకు ఆపద సమయాల్లో సహాయ సహకారాలు అందిస్తున్న మైనార్టీలపై కక్షకట్టి కొందరు వైసీపీ తొత్తులుగా ఉన్న పోలీసు, ఇతర అధికారులు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని, వారికి శిక్ష తప్పదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలపై అక్రమ కేసులు, రౌడీషీట్లు ప్రారంభించిన ఘనత వారికే దక్కుతుందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో రాజ్యాంగాన్ని కాలరాస్తున్నా ప్రశ్నించరాదని, తమపై కేసులు పెడుతున్నారని, ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండకపోయినా, ఆసుపత్రికి వచ్చిన ప్రతి కేసు బయటకు ప్రాంతాలకు పంపుతున్నా ప్రశ్నించరాదన్నారు. వైసీపీ కాకుండా మిగిలిన పార్టీల్లో ఉన్న ముస్లింలపై మంత్రి పెద్దిరెడ్డి ఇబ్బందులు పెడుతున్నారని, 2022 వరకు తనపై ఒక్క కేసులేదని, ఇప్పుడు ఏకంగా రౌడీషీట్ పెట్టారని చెప్పారు. రాజకీయ నాయకులకు అండగా పని చేస్తున్న పుంగనూరు సీఐ రాఘవరెడ్డి, మరి కొందరు అధికారులపై ప్రైవేటు కేసులు వేయడం, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు పోలీస్‌గిరి, సద్దాంహుసేన్, అబ్బాస్, సుధ, నూర్, జనసేన నాయకుడు చిన్నారాయల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అందరికీ ఇబ్బందులే..



మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు పార్థసారథి రెడ్డి

పలమనేరు/గంగవరం, ఫిబ్రవరి22 : వైసీపీ పాలనలో అందరికీ ఇబ్బందులే ఉన్నాయని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, పలమనేరు నియోజకవర్గ ఇన్‌చార్జి పార్థసారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం పలమనేరు కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాట చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మొట్టమొదటగా రాప్తాడు సభలో ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. కృష్ణ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. రైతులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేశామని ప్రభుత్వం చెబుతోందని, అయితే నియోజకవర్గంలో చెరువుల్లో నీరున్నా ఆయకట్టులో ఎందుకు బీడుభూములుగా ఉన్నాయో ప్రభుత్వం ప్రజలకు వివరించాలన్నారు. పట్టురైతుల సంక్షేమం, ప్రోత్సాహం కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వం కిలో పట్టుగూళ్ల ఉత్పత్తికి చెల్లిస్తున్న రూ. 50 ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కేంద్రం నుంచి విభజన హామీలు ఎందుకు సాధించలేదో ప్రజలకు తెలియజేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల సందర్భంగా చెప్పిన హామీలు అన్ని నెరవేర్చానని చెబుతున్నారని, అయితే సంపూర్ణ మద్యనిషేధం చేశారా, ప్రత్యేక హోదా తెచ్చారా, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారా అని ప్రశ్నించారు.

కనుల పండువగా వేణుగోపాలుడి కల్యాణం




రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం, విశ్వబ్రాహ్మణులచే కాశీయాత్ర ఉత్సవం

వి.కోట, ఫిబ్రవరి22: రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం గురువారం కనులపండువగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు విశ్వ బ్రాహ్మణ సంఘం వారు కాశీయాత్ర జరిపించారు. వి.కోట సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మి కుమారులు పీ.ఎస్. నాగరాజ్, పీ.ఎస్. మంజునాథ్‌ల నేతృత్వంలో ఆలయ మండపంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహాలను కొలువుతీర్చి వివాహం నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. రాత్రి ఉత్సవ మూర్తులను గరుడవాహనంపై కొలువుతీర్చి బలిజ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో పురవీధులలో ఊరేగించారు. టీటీడీ ఆస్థాన విద్వాంసులు కేఎస్ మూర్తి వారి బృందంచే వాయిద్య కచ్చేరి నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి22: పుంగనూరు మండలం ఏ.కొత్తకోట మార్గంలోని నల్లగుట్లపల్లె క్రాస్ వద్ద బుధవారం రాత్రి ఆటో-ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడినట్లు హెడ్‌కానిస్టేబుల్ కేశవ రాజు తెలిపారు. నల్లగుట్లపల్లెకు చెందిన సోమశేఖర్ కుమారుడు విజయకుమార్(24) కర్ణాటక రాష్ట్రం రాజుపల్లె సమీపంలోని ఓ హోటల్‌లో పని చేస్తూ బుధవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి ద్విచక్రవాహనంలో వస్తుండగా నల్లగుట్లపల్లె క్రాస్ వద్ద ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పుంగనూరు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి ఆందోళనగా ఉందని డాక్టర్లు సూచనల మేరకు మదనపల్లెకు తరలించినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

సదుం, ఫిబ్రవరి 22: కుక్కల దాడిలో దుప్పి మృత్యువాతపడిన ఘటన సదుం మండలంలో వెలుగు చూసింది. జోగివారిపల్లె పంచాయతీ నాయునివారిపల్లె సమీప అటవీ ప్రాంతం నుంచి లేగ దుప్పి గురువారం గ్రామ పరిసరాల్లోకి రావడంతో కుక్కల కంట పడి వాటి దాడిలో మృత్యువాత పడింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు సోమల మండలం, ఆవులపల్లె బీట్ అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని బీటు సిబ్బంది సురేంద్ర, మహేశ్‌లు పరిశీలించారు. మండల పశువైద్య సిబ్బంది దుప్పి కళేబరానికి పంచనామా నిర్వహించి అక్కడే దానిని ఖననం చేశారు.

బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు

చౌడేపల్లె, ఫిబ్రవరి 22 : బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ.83 లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. రూ.83,18,418 నగదు, 26గ్రాముల బంగారు, 330 గ్రాములు వెండి, మలేషియా ఆర్ఎం నోటు ఒకటి, ఓమన్ 100 బైసా నోటు, 5, 10 ఈరో నోట్లు ఒక్కొక్కటిని 56 రోజులలో భక్తులు అమ్మవారికి సమర్పించారన్నారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.65,423 నగదు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రూప్ టెంపుల్స్ ఇన్స్పెక్టర్ రవికిరణ్‌కుమార్ రెడ్డి, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

పట్రపల్లె క్రాస్‌లో శిలాఫలకం తొలగింపు

ఆందోళనకు దిగిన టీడీపీ శ్రేణులు

వి.కోట, ఫిబ్రవరి 22: వి.కోట-కేజీఎఫ్ ప్రధాన రహదారి పక్కనే 2002 డిసెంబరు 6న అప్పటి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వేసిన ఆర్అండ్‌బీ శిలాఫలకాన్ని కొందరు భూస్వాములు తొలగించారు. రెండు దశాబ్దాల క్రితం వేసిన ఈ శిలాఫలకాన్ని తమ భూమికి అడ్డుగా ఉందంటూ పొలం యజమాని గురువారం ఉదయాన్నే ఎక్స్‌కవేటర్ సాయంతో శిలాఫలకాన్ని ధ్వంసం చేయించారు. విషయం తెలుసుకున్న పట్టణ టీడీపీ అధ్యక్షుడు నారాయణ స్వామి, ఇతర శ్రేణులు అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. కావాలనే అధికార నేతల అండతో గత ప్రభుత్వ హయంలో వేసిన శిలాఫలకాన్ని తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పొలానికి అడ్డుగా ఉండటంతో తొలగించామని, సదరు స్థలం తమ పట్టాభూమి అంటూ వాదనకు దిగారు. దీంతో ఇరు పక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎట్టకేలకు మరో చోట శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

ఎమ్మార్పీఎస్ నేత వెంకటస్వామికి ఘన నివాళి



పేదలకు అన్నదానం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి22: పుంగనూరుకు చెందిన ఎమ్మార్పీఎస్ నేత మిద్దింటి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా దళితసంఘాలు ఆయనకు ఘనంగా నివాళులర్పించాయి. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం దళిత వర్గాలు పని చేయాల్సిన అవసరముందన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మిద్దింటి పృథ్వీరాజ్, నరసింహులు, అశోక్‌కుమార్, రాజన్న, శ్రీనివాసులు, రెడ్డెప్ప, కృష్ణప్ప, జెవీనాగరాజ, చిన్నబ్బ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలం పాటలు

పలమనేరు, ఫిబ్రవరి22 : మున్సిపాలిటీలోని దినసరి, వారపు కూరగాయల సంతలతో పాటు వారపుసంతలోని 11 చింతచెట్లు, చిత్తూరు డైవర్షన్ రోడ్డులోని 2 చింతచెట్లు ఫలసాయం, బొమ్మిదొడి, నీళ్లకుంట చెరువుల్లో చేపల పెంపకానికి వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈనెల 23న మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటల్లో పాల్గొనే వారి నుంచి గురువారం సాయంత్రం వరకు ధరావత్తు, సాల్వెన్సీలను సేకరించినట్లు తెలిపారు.

25న నేత్రచికిత్సా శిబిరం

పలమనేరు, ఫిబ్రవరి22 : పలమనేరు లయన్స్‌క్లబ్ ఆవరణలో ఈనెల 25వ తేది ఉచిత నేత్రచికిత్సా శిబిరం నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన సి.సహదేవ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎస్.సందీప్, కుటుంబ సభ్యుల సహకారంతో ఈనేత్రచికిత్సా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో కుప్పం పీఈఎస్ నేత్రవైద్యులు పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమున్నవారికి కుప్పం పీఈఎస్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రఘు, వీరభద్రయ్య విజ్ఞప్తి చేశారు.

అశ్వవాహనంపై ఊరేగిన కాశీవిశ్వేశ్వరుడు



పలమనేరు,ఫిబ్రవరి22: పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం రాత్రి స్వామి వారిని, అమ్మవారిని అశ్వవాహనంపై అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త గంటే వీరభద్ర, ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ సిబ్బంది భాస్కర్‌రెడి, భక్తులు పాల్గొన్నారు. లేట్ మత్యం విజయమ్మ, నటరాజశెట్టి, సి.స్వర్ణలత అండ్ సన్స్, మిద్దింటి బాలరాజు అండ్ సన్స్ ఎరుకుల సంఘం ఉభయదారులుగా వ్యవహరించారు.

అష్టకాల భైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



పలమనేరు, ఫిబ్రవరి22 : పలమనేరు బసవన్నకట్ట వీధిలో వెలసిన బసవేశ్వరస్వామి ఆలయంలో అష్టకాల భైరవస్వామి నూతన విగ్రహప్రతిష్ఠ చేశారు. గురువారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి, రేణుకారెడ్డి దంపతులు స్వామివారికి పూజలు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

రొంపిచెర్ల, ఫిబ్రవరి 22: జాండ్లవారిపల్లె పంచాయతీ గుండ్లకాడపల్లెకు చెందిన సురేంద్రనాథరెడ్డికి సీఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కు రూ 3లక్షలను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అందించారు. కార్యక్రమంలో మంత్రి పీఏ మునితుకారాం, జడ్పీటీసీ రెడ్డిశ్వరెడ్డి, వైస్ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్‌లు నాగిరెడ్డి, ఇబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రొంపిచెర్ల, ఫిబ్రవరి 22: బండకిందపల్లె పంచాయతీ కమ్మోళ్లపల్లె సమీపంలో గుర్తుతెలియనివ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ తులసీరాం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన పురుషుడి వయసు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, తెలుపు రంగు కలర్‌షర్టు, మెరూన్ కల్లర్ ఫుల్‌డ్రాయర్, నలుపు,పచ్చ రంగు పూల డిజైన్ లుంగీ, కుడి చేతికి ఎరుపు రంగు దారం వుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

కోలాహలంగా ఉట్లోత్సవాలు

సోమల, ఫిబ్రవరి 22: మండలంలోని అన్నెమ్మగారిపల్లె పంచాయతీ టీఎం. గొల్లపల్లె, పెద్దఉప్పరపల్లె పంచాయతీ వడ్డిపల్లె సల్లాపురమ్మ ఆలయాల్లో అమ్మవార్ల జాతర వేడుకల్లో భాగం గురువారం ఉట్లోత్సవాలు కోలాహలంగా జరిగాయి. ఈ నేపథ్యంలో ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకీలో అలంకరించి పోతురాజు విన్యాసాలతో టీఎం. గొల్లపల్లె, అన్నెమ్మగారిపల్లె, చిప్పిరెడ్డిగారిపల్లె, నాగిళ్ళవారిపల్లె, వడ్డిపల్లె, పొలికిమాకులపల్లె తదితర గ్రామాల్లో ఊరేగించారు. యువకులు ఆలయం వద్ద తపస్మాన్‌ను ఏర్పాటు చేసి కోలాహలంగా రంగు నీళ్ల చల్లుకుంటూ తపస్మాన్‌లోని కానుకలను కైవశం చేసుకోవడానికి పోటీపడ్డారు.

వాటర్‌షెడ్ నిధుల వినియోగంపై తనిఖీలు

సోమల, ఫిబ్రవరి 22: మండలంలోని ఆరు మెగా వాటర్‌షెడ్ పరీవాహక ప్రాంతాల్లో చేపట్టిన పనులను గురువారం తనిఖీ బృందం పరిశీలించింది. అలాగే రాయితీ నిధులతో రైతులకు అందజేసిన పరికరాలను లబ్ధిదారుల వద్ద పరిశీలించారు. పలువురు రైతులు తమకు రాయితీ పరికరాలు అందజేయాలని వినతులు అందజేశారు. సోమల, ఇరికిపెంట, నడింపల్లె, నంజంపేట, పొదలకుంటపల్లెలో తనిఖీలు చేపట్టారు.

1, 2 తేదీల్లో బైరెడ్డిపల్లెలో ఉరుసు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 22 : బైరెడ్డిపల్లె పట్టణంలో వున్న హజరత్ బిస్మిల్లా షాఖాదరి దర్గా ఉరుసు ఉత్సవాలు మార్చి 1, 2 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1వ తేది రాత్రి గంధం ఊరేగింపు, 2వ తేది రాత్రి దర్గావద్ద ఖవ్వాలి పాటకచ్చేరి ఉంటుందన్నారు. :

అయూబ్‌ఖాన్‌కు డాక్టరేట్ ప్రదానం



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి22: పుంగనూరు పట్టణానికి చెందిన సామాజికవేత్త ఏపీజే అబ్దుల్‌కలాం ట్రస్ట్ వ్యవస్థాపకుడు అయూబ్‌ఖాన్‌కు గురువారం సికింద్రాబాద్ స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. సామాజిక సేవతోపాటు మతసామరస్యం, పరమత సహనంపై ఆయన చేస్తున్న కృషిని గుర్తించి యూనివర్సిటీ డైరెక్టర్ మార్టిన్‌కర్రి డాక్టరేట్‌ను అందజేసినట్లు ఆయన తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కాలేయ వ్యాధి బాలుడికి జీజేఎం రూ.లక్ష ఆర్థిక సాయం


బాధితుడి తండ్రికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 22: కాలేయ వ్యాధితో బాధపడుతున్న బాలుడికి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్‌మోహన్ రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. నగరంలోని 8వ వార్డుకు చెందిన మనోజ్ కుమారుడు సుశాంత్ (7) తీవ్రమైన కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈవిషయాన్ని టీడీపీ నేతలు గురజాల జగన్మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. కాగా గురువారం లక్ష్మీనగర్ కాలనీలోని జీజేఎం కార్యాలయంలో బాలుడికి మెరుగైన చికిత్సకోసం మనోజ్‌కు రూ.లక్ష అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

0-5 ఏళ్ల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలి


మాట్లాడుతున్న జిల్లా టీబీ నివారణ అధికారి వెంకట ప్రసాద్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 22: మార్చి 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో 0-5 వయసు ఉన్న పిల్లలందరికీ మిస్ కాకుండా పోలియో చుక్కలు వేయాలని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ఆదేశించారు. గురువారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని ఆడిటోరియంలో పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య సిబ్బంది, ఆశాలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీన 95 శాతం పోలియో చుక్కలు వేయాలన్నారు. మిగిలిన వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి వేయాలని ఆదేశించారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 12 రూట్లు, 122 బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేంగా బస్టాండ్, రైల్వే స్టేషన్లు, బస్టాపుల్లో 7 బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏ ఒక్కరూ మిస్ కాకుడదని ఆయన తెలిపారు. ఎంపోలు, ఎస్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మామిడిలో అంతర పంటసాగు లాభదాయకం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 22: మామిడి తోటల్లో వివిధరకాల అంతర పంటలను సాగుచేయడం ద్వారా భూమిసారాన్ని పెంపొందించడంతో పాటు రైతులు ఆర్థికంగా ఆదాయాన్ని గడించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు నాగమణి, రాఘవేంద్రలు సూచించారు. గంగాధరనెల్లూరు మండలంలోని పాపిరెడ్డిపల్లె, నందనూరు పంచాయతీల్లో చిత్తూరు ఏరువాక వ్యవసాయ శాస్త్రవేత్తలు పలువురు రైతులకు చెందిన మామిడితోపుల్లో అంతర పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు అంతర పంటలకు సంబంధించి అధికదిగుబడి, మామిడికి పురుగు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులు ఎంతెంత మోతాదులో పిచికారి చేయాలనేది శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు చక్రవర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక పనులపై సమాచారం ఇవ్వండి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 22: గ్రామాల్లో ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గంగాధరనెల్లూరు సీఐ శంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని ముక్కళత్తూరు దళితవాడలోని ప్రజలతో గురువారం రాత్రి సీఐ గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. పోలింగ్‌కేంద్రాల వద్ద ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసుల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ ఠాణాచెక్‌పోస్టు కూడలిలో గురువారం సాయంత్రం పలు వాహనాలను సీఐ తనిఖీ చేశారు.

25న షబేబరాత్ పండుగ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 22: ముస్లింల పవిత్రమైన షబేబరాత్ పండుగను ఈనెల 25న ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పితృదేవతల ఆత్మలకు శాంతి కలగడానికి ఆదివారం రాత్రంతా జాగారం చేసి ప్రార్థనలు చేస్తారని పేర్కొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం దారుణం

కార్వేటినగరం, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను హరించడం చాలా దారుణమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ ఖండించారు. గురువారం యుగంధర్ మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను ఉక్కుపాదంతో అణగదొక్కడం అప్రజాస్వామ్యమని అన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, విచ్చలవిడిగా పాత్రికేయులు, వారి కార్యాలయాలపై వైసీపీ మూకలు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు.

209వ రోజు అన్నదానం

గుడిపాల, ఫిబ్రవరి 22: మండలంలోని అన్నక్యాంటీన్‌లో గురువారం 209వ రోజు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లె రవి నాయుడు భోజనం వితరణ చేశారు. మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు, కార్యదర్శి కిట్టు, నాయకులు ఏకాంబరం, చల్లా తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలకేంద్రంలోని అన్నక్యాంటీన్‌లో గురువారం టీడీపీ నేత మెకానిక్ గిరి భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేపనపల్లి హేమాద్రి, వీరభద్రయ్య, హరి, ఏకాంబరం, భాస్కర్, గురవప్ప, హిమకర్, బాలాజి, దాము తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి


దుప్పి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది, గ్రామస్తులు

సదుం, ఫిబ్రవరి 22: కుక్కల దాడిలో దుప్పి మృత్యువాతపడిన ఘటన సదుం మండలంలో వెలుగు చూసింది. జోగివారిపల్లె పంచాయతీ నాయునివారిపల్లె సమీప అటవీప్రాంతంనుంచి లేగ దుప్పి గురువారం గ్రామ పరిసరాల్లోకి రావడంతో కుక్కల కంటపడి వాటి దాడిలో మృత్యువాత పడింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు సోమల మండలం, ఆవులపల్లె బీట్ అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని బీటు సిబ్బంది సురేంద్ర, మహేశ్‌లు పరిశీలించారు. మండల పశువైద్య సిబ్బంది దుప్పి కళేబరానికి పంచనామా నిర్వహించి అక్కడే దానిని ఖననం చేశారు.

వంద లీటర్ల సారా స్వాధీనం
- వ్యక్తి పరార్


పట్టుబడిన సారా ట్యూబ్

గుడిపాల, ఫిబ్రవరి 22: మండలంలోని రాసనపల్లి తదితర ప్రాంతాల్లో గురువారం గుడిపాల పోలీసులు దాడులు నిర్వహించి వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ, వెస్ట్ సీఐ రవిశంకర్ ఆదేశాలమేరకు ఈ దాడులు నిర్వహిస్తున్నామని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ దాడుల్లో రూ.లక్ష విలువ చేసే వంద లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ


పాలసముద్రం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ట్రైనీ డీఎస్పీ పవన్ కుమార్

పాలసముద్రం, ఫిబ్రవరి 22: మండలంలోని పాలసముద్రం, శ్రీకావేరిరాజుపురం, నరసింహాపురం గ్రామాల్లోని పాఠశాలల్లో రాబోవు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల భవనాలను గురువారం ట్రైనీ డీఎస్పీ పవన్‌కుమార్, కార్వేటినగరం సీఐ సత్యబాబుతో కలసి తనిఖీ చేశారు. అనంతరం పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి అక్రమ రవాణాకు తావు లేకుండా పోలీసులు గస్తీని ముమ్మరం చేయాలని ఎస్ఐ ప్రసాద్, సిబ్బందికి సూచించారు.

నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న గంధమనేని జయశంకర్ నాయుడు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 22: చంద్రబాబు జైలుకెళ్లిన సమయంలో మనోవేదనతో మృతిచెందిన వి.వి.పురం గ్రామ పంచాయతీ, గంగమ్మగుడి గ్రామానికి చెందిన టీడీపీ అభిమాని కరణం ఆంజనేయులు నాయుడు కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించడానికి వస్తున్న నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం నాయుడు, వేమనాయుడు, సిద్దయ్యశెట్టి, దాము నాయుడు, నిరంజన్‌రెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి, బాలాజీ నాయుడు, వాసు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ మండలంలోని ముత్తుకూరు గ్రామంలో శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పర్యటనను మండల ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ కోరారు. మండలంలోని 17 పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

ఆసరా చెక్కుల పంపిణీ

తవణంపల్లె, ఫిబ్రవరి 22: మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆసరా చెక్కులను పూతలపట్టు వైసీపీ సమన్వయకర్త సునీల్‌కుమార్ పంపిణీచేశారు. మండలంలోని 1298 సంఘాలకు రూ.13,45,35,000 మెగా చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో హేమలత, ఏపీఎం రవి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాలు

పాలసముద్రం, ఫిబ్రవరి 22: మండలంలోని వెలుగు కార్యాలయంలో గురువారం వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను ఎంపీడీవో రామనాథ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అన్ను, ఏవో విద్యావతి, సర్పంచ్‌లు మహేష్ నాయుడు, భాస్కర్ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ తులసీరామ్ యాదవ్, ఈవోపీఆర్డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని పలువురు వలంటీర్లకు పూతలపట్టు సమీపాన గల బాలాజీ కల్యాణ మండపంలో గురువారం సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను అందచేశారు. పూతలపట్టు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త సునీల్‌కుమార్, ఎంపీపీ కుమారి, జడ్పీటీసీ దేవిక, నాయకులు తలపులపల్లి బాబు రెడ్డి, రాజరత్నం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జయచంద్రారెడ్డి, ద్వారకనాథ రెడ్డి, దొరస్వామి రెడ్డి, జయచంద్రారెడ్డి, పోలవరం సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో ప్రసన్నకుమారి, అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సద్గుణం.. సదాచారాలే రామాయణ సారాంశం


ప్రవచనాలు చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 22: ఏ కావ్యమైనా, పురాణమైనా, ప్రవచనమైనా చపలత్వానికి ఉన్న స్థానం ముక్తి, రక్తికి ఉండటం విశేషమని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు అన్నారు. కొంగారెడ్డిపల్లె గురునగర్‌కాలనీలోని ఆర్.కె. మోడల్ పాఠశాలలో గురువారం సీతాయాశ్చరితమ్ (సీతమ్మకథ) ప్రవచనాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సమాజంలో దుర్గుణంతో సద్గుణం, దురాచారాలతో సదాచారాలు సంభవించినట్టే.. సమాజానికి రామాయణం ఎంత ఆదర్శమో అందులోని మంచి చెడులు కూడా అంతే ఆదర్శమని చాగంటి కోటేశ్వరావు అన్నారు. చపలచిత్తం(వశం) అనేది యుగయుగాలుగా మానవులకు అలవాటైందని. మానవుడు చపలచిత్తం జయించలేక రాజ్యాలు, పరువు మర్యాదలు, సమాజంలో గౌరవం పోగొట్టుకున్నారని, అలానే సీతాచరితంలో ప్రధానంగా దుర్మార్గులైన రావణుడు, ఇంద్రజిత్‌లు ఈ కోవలోని వారే అన్నారు. కారణజన్మురాలైన సీతామాతా భూదేవి పుత్రికైనందున సహనంలో ఆమె భూమాతను తలపిస్తున్నదన్నారు. సమాజంలో సహనమనే సద్గుణం లేకపోతే మానవడు మనజాలడన్నారు. రోజు పురాణాలు పారాయణం చేసి, మంత్రోపదేశాలు విని, ప్రవచనాలు విని ఆతర్వాత తనలోని చపలచిత్తంతో చేయరాని పనులన్నీ చేసి నేనే ఉత్తముడినని డంబాలు పలకడం నేటి నైజమైందన్నారు. కేవలం ప్రవచనాలు వినినాలో మార్పు వచ్చిందంటే అది అతడిలో మార్పు రాదని, స్వతహాగా తనలోని అహం, దురాశ, దుర్గుణాలను రోజు వారీ కార్యక్రమాల్లో క్షణకాలమైనా పక్కన పెట్టి మనిషిలాగా జీవించిన నాడే అతడు ఉత్తముడవుతాడన్నారు. సీతాయాశ్చరితమ్‌లోని జనకుడి తనయ సీత బాల్య, కౌమార దశలోని కొన్ని అంశాలను నేటి సమాజంలో జరుగుతున్న అంశాలకు అన్వయించి ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో అరవిందో సొసైటీ సభ్యులు నందకుమార్, రమణ, రామ్మూర్తి, పురాణ పండిట్ రామ్మూర్తి, ఆయిల్ వరదయ్యలతో పాటు అధిక సంఖ్యలో పురప్రజలు పాల్గొన్నారు.



చిత్తూరులో సుజాతమ్మ ఇంటివద్ద స్థానికులకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి, చింతగుంపలపల్లెలో భువనేశ్వరి పర్యటనలో పాల్గొన్న ప్రజలు

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

● మరణించిన పలువురు కుటుంబసభ్యులకు పరామర్శ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 22: నారా భువనేశ్వరికి చిత్తూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టుచేసి జైలుకు పంపడంతో మనస్తాపానికి గురై మృతిచెందిన వారి కుటుంబాలను 'నిజం గెలవాలి' కార్యక్రమం పేరుతో ఆమె పరామర్శిస్తున్నారు. అందులో భాగంగా మూడో రోజైన గురువారం నగరంలోని 50వ డివిజన్‌లో చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గత ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన గుండెపోటుతో మృతి చెందిన పార్టీ కార్యకర్త చెరుకూరి సుజాతమ్మ కుటుంబాన్ని ఆమె పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. చెరుకూరి సుజాతమ్మ కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. కాగా నారా భువనేశ్వరికి మురకంబట్టు జంక్షన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలలు వేసి, పుష్పగుచ్చాలు ఇచ్చి, టపాకాయలు పేల్చి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, నేతలు చంద్రప్రకాష్, గురజాల జగన్మోహన్, కటారిహేమలత, కాజూరు బాలాజి, తేజస్విని, కోదండయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టేకుమందలో....

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 22: చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక బంగారుపాళ్యం మండలం టేకుమంద గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని వి. గోవిందయ్య గౌడ్ 2023 అక్టోబర్ 3వ తేదీన సాయంత్రం టీవీ చూస్తూ గుండెపోటుతో మృతిచెందారు. గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన నారా భువనేశ్వరి గోవిందయ్య గౌడ్ భార్య జయమ్మకు రూ.3 లక్షలు చెక్‌ను అందజేశారు. అంతకుముందు నారా భువనేశ్వరికి గ్రామస్తులు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. మాజీ మంత్రి అమరనాథ రెడ్డి, పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్, మండల కన్వీనర్ ఎన్‌పీ జయప్రకాష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జయచంద్ర నాయుడు, ఎన్ఆర్ఐ విక్రమ్, మాజీ ఎంపీటీసీ చిత్ర, మాజీ జడ్పీటీసీ కళావతి తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కుప్పాల మురళి, లోకనాథ నాయుడు, భాష్యం వంశీ, కమల్‌నాథ రెడ్డి, హేమచంద్ర నాయుడు, రమేష్, హరిప్రసాద్, జానకిరామ్, సుబ్బన్న, జాకీర్ హుస్సేన్, కవి, మహిళా కార్యకర్తలు రాధిక, అధిక సంఖ్యలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతగుంపలపల్లెలో....

ఐరాల, ఫిబ్రవరి 22: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఐరాల మండలం చింతగుంపలపల్లెలో జయప్రకాష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు లత, వీడీబీ హరిబాబు నాయుడు, సందీప్, కార్లాల అరుణ, కోదండయాదవ్, చౌదరి నాయుడు, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్


గంగాధరనెల్లూరులో మాట్లాడుతున్న చింతామోహన్

గంగాధరనెలూరు, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నివర్గాల ప్రజలు దృఢంగా నమ్ముతున్నారని కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. గంగాధరనెల్లూరులో గురువారం కాంగ్రెస్‌పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున 175 ఎమ్మెల్యే స్థానాల్లో, 25 పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థులు తప్పనిసరిగా పోటీ చేస్తారని, ఎమ్మెల్యేలు 130మంది, ఎంపీలు 20 మంది విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పత్రిక, మీడియా ఛానళ్ళ విలేకరులపై అధికార పార్టీ నేతలు దాడులు చేయడం సమంజసం కాదని చెప్పారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్‌చేయడం భావ్యంకాదన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన విలేకరులకు అక్రిడేషన్‌కార్డులు కూడా మంజూరు చేయలేకపోయారని, ఆఖరికి మూడు సెంట్లు ఇంటిస్థలం ఇస్తానని చెప్పి విలేకరులను సైతం తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. ఈసమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజుపురం మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు చంద్రబాబు, తులసిమణి, పీసీసీ మాజీ ప్రధానకార్యదర్శి పరదేశి, డీసీసీ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా తిరుపతిని చేయాలని మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నీళ్ళు మీకు... రాళ్ళు మాకా అనే బ్యానరును చేతబట్టి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, పూతలపట్టు ఇన్‌చార్జి నాగరాజ, జిల్లా కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వండి


డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 22: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరే ఉపాధ్యాయులను కలెక్టరేట్‌కు వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ జారీచేసిన ఆదేశాలు బాధాకరంగా ఉన్నాయని, వారికి మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో నాయకులు అభ్యర్థించారు. గురువారం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎ. మునాఫ్ నాయకత్వంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టరేట్‌లో డీఆర్వో బి. పుల్లయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కావాలని కోరే వారు వ్యక్తిగతంగా కలెక్టరేట్‌కు హాజరుకావాలని ఇచ్చిన ఆదేశాలు తమకెంతో బాధాకరంగా ఉందన్నారు. సిజేరియన్ ఆపరేషన్లు చేయించుకున్న ఉపాధ్యాయినులు దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేయరాదని డాక్టర్లు సూచించారన్నారు. ఇంకా డయలసిస్, హృదయసంబంధిత, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఉపాధ్యాయులు ఆరోగ్యరీత్యా కలెక్టరేట్‌కు రాలేరన్నారు. ఇలాంటి ఉపాధ్యాయుల విన్నపాలను రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి ఆదేశాలను నిలుపుదల చేయించాలని కోరారు. ఇటు ఉపాధ్యాయులు సమీప మండల ఎన్నికల అధికారులకు లేదా రిటర్నింగ్ అధికారికి, లేదా ప్రభుత్వ వైద్యాధికారి వద్ద వ్యక్తిగతంగా హాజరై, ఎన్నికల విధుల మినహాయింపు పొందేందుకు అవకాశం కల్పించాలని వారు కోరారు. డీఆర్వోను కలిసినవారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చెంగ్రాయ మందడి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి. మోహన్, యూటీఎఫ్ నాయకులు రెడ్డెప్ప నాయుడు, ఏకాంబరం, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

బోసిపోయిన వలంటీర్లకు వందనం


సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

- డిప్యూటీ సీఎంతో పాటు ఎంపీపీ, జడ్పీటీసీ గైర్హాజరు

పెనుమూరు, ఫిబ్రవరి 22: పెనుమూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఈకార్యక్రమం మొదట ఉదయం 9గంటలకు అని చెప్పినా డిప్యూటీ సీఎం ఆ సమయానికి రాలేకపోవడంతో సాయంత్రం 3గంటలకు మార్చారు. అయితే 3.30 అవుతున్నా కూడా కుర్చీలు నిండలేదు. ఈకార్యక్రమానికి ఎంపీపీ, జడ్పీటీసీతో పాటు చాలా మంది సర్పంచులు, ఎంపీటీసీలు కూడా రాకపోవడంతో సభ బోసిపోయింది. మండల వైసీపీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డిల చేతుమీదుగా వలంటీరకు సన్మానం జరిగింది. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, యతీశ్వర్ నాయుడు, రాజారెడ్డి, లక్ష్మీపతి, పాల్గొన్నారు. పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నారాయణస్వామి కాకుండా మరో అభ్యర్థి కోసం వైసీపీ అధిష్ఠానం కసరత్తు చేస్తుందని వైరల్ చేస్తున్న పార్టీ నాయకులను వదిలిపెట్టమని హెచ్చరించారు.

25న ఉచిత నేత్ర వైద్యశిబిరం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 22: రాముల గుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఈనెల 25న ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు సుభాష్‌జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల డాక్టర్ల సంయుక్త సహకారంతో నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్యసేవలను నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు మాదక ద్రవ్యాల నిషేధంపై ర్యాలీ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 22 : మాదక ద్రవ్యాల నిషేధంపై ఈనెల 24న 'స్టూడెంట్స్ ఎన్‌టైటిల్మెంట్ ర్యాలీ ఫర్ యాంటీ డ్రగ్స్' ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జాన్ శామ్యూల్ కిమ్ చెప్పారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోతోందని చెప్పారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 24న ఉదయం 10 గంటలకు నగరంలోని షర్మన్ స్కూల్ నుంచి ర్యాలీ ప్రారంభమై సీసీఆర్ కళాశాల, మిట్టూరు, ఎమ్మెస్సార్ సర్కిల్, దర్గా సర్కిల్, ప్రభుత్వాసుపత్రి, చర్చివీధి, గాంధీ రోడ్డు, పాత కోర్టు మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ, న్యాయసేవా సదన్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నిషేధంపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా న్యాయ సలహాదారు విజయ్‌కుమార్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జోబ్, నాగరాజు రెడ్డి, ఢిల్లీ బాబు పాల్గొన్నారు.

పోస్టుకార్డు ఉద్యమంలో పెన్షనర్లు పాల్గొనాలి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 22: పెన్షనర్లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే జీవన భృతిపై ఆదాయపు పనున్న విధించడం శోచనీయం అని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎన్ కేశవులు గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు ఆదాయపు పన్ను నుంచి విముక్తి కల్పించాలంటూ వెంటనే పెన్షనర్లు పోస్టుకార్డు ద్వారా తమ నిరసనను ఉద్యమంలా తెలియజేయాలని ఆయన కోరారు.

నేడు ఉత్సవ మండపం ప్రారంభం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 22: గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరాలయం ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా నిర్మించిన గిరి ప్రదక్షిణ ఉత్సవ వాహన మంటపాన్ని శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ ధర్మకర్తలు పూల సుబ్రమణ్యం నాయుడు, డా. ఎస్‌టీ రంగనాథన్ దంపతులు, డిప్యూటీ మేయర్ ఆర్. చంద్రశేఖర్, కార్పొరేటర్ ఇందు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. మాఘమాస పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్వామి అమ్మవార్లకు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ముందే రద్దీ... ఆపై అరటి వ్యర్థాలు

● ప్రమాదపు అంచులో ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు


రోడ్డు పక్కనే పడేసిన అరటి వ్యర్థాలు

గుడిపాల, ఫిబ్రవరి 22: చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని పానాటూరు, పల్లూరు, గొల్లమడుగు తదితర గ్రామాల్లో రోడ్డుపక్కన అరటి వ్యర్థాలు పడేస్తూ ప్రమాదాలకు నిలయంగా మార్చుతున్నారు. చిత్తూరు నుంచి వేలూరు వైపు మినీ లారీల్లో అరటి గెలలను తీసుకెళ్ళి, మిగిలిన వ్యర్థాలను రోడ్డుపక్కనే పడేస్తున్నారని, ఈ కారణంగా రద్దీగా ప్రయాణించే వాహనాలు... ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు పడిలేచి గాయాలపాలౌతున్నారు. తమిళనాడు పోలీసులు రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి వ్యర్థాలు పడేయకుండా చర్యలు చేపట్టడంతో అక్కడ వేయాల్సిన వ్యర్థాలను ఆంధ్ర బోర్డర్‌లో పడేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.